క్లుప్తంగా

నీటి బిల్లులు విడుదల

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు నియోజకవర్గ పరంగా పెండింగ్‌లో ఉన్న నీటి బిల్లులు మంజూరు చేశారని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నరేంద్రకుమార్ మంగళవారం తెలిపారు. మొత్తం 126 బిల్లులకు సంబంధించి రూ.33.91 లక్షలు విడుదల చేశారని, తాగు నీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్లతో నీటి సరఫరా చేసిన వారికి బిల్లులు క్లియర్ చేస్తామని చెప్పారు.

విద్యా ప్రణాళికపై సమావేశం



టీచర్లకు సూచనలు చేస్తున్న ఎంఈఓ

ఐరాల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు మండల స్థాయి విద్యా ప్రణాళిక, ప్రాథమిక స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి కోర్స్ డైరెక్టర్‌గా హెచ్‌ఎం కోమల వ్యవహరించారు. ఎంఈఓలు రుషీంద్రబాబు, దామోదర్‌నాయుడు హాజరై మాట్లాడారు. విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించి రానున్న పరీక్షలకు సంసిద్ధం చేయాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యేలా డిజిటల్ టచ్ స్క్రీన్ టీవీల ద్వారా బోధించాలని చెప్పారు.

ఆదియోగి విగ్రహం ఊరేగింపు



నగరంలో ఊరేగిస్తున్న ఆదియోగి విగ్రహం

చిత్తూరు రూరల్: చిత్తూరులో మంగళవారం ఆదియోగి విగ్రహాన్ని ఊరేగించారు. శివ రాత్రి మహోత్సవంలో భాగంగా తమిళ నాడు కోయంబత్తూరులోని ఆదియోగి విగ్రహాన్ని చిత్తూరుకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఈ విగ్రహానికి భక్తులు ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. భక్తులకు ఈశా కేంద్ర నిర్వాహకులు స్వామి విభూది ఇచ్చారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాజాత సభ్యులు

ఐరాల: పొలకల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నాబార్డ్ వారి సౌజన్యంతో ఖాతాదారులకు పొలకలలో మంగళవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌బీఐ మేనేజర్ హనమంతునాయక్ బ్యాంకు సేవలు, కేంద్ర పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఎంపీ రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ కళాజాత బృందం సభ్యులు మహేష్, చంద్ర, అశోక్ మ్యాజిక్ షో, పాటల ద్వారా ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. సీసీ మునిరాజు, సంఘ మిత్రలు పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా

గుడిపాల: రైతులకు అందుబాటులో యూరియా ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి మాధవి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ, మండల కేంద్రంతో పాటు పాపసముద్రం రైతుభరోసా కేంద్రాల్లో నాగార్జున యూరియా ఉందన్నారు. కావలసిన రైతులు రూ.267 చెల్లించి తీసుకోవాలన్నారు.

ఈరోజు

వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం

యాదమరి: మండలంలోని జంగాలపల్లె పంచాయతీలోని గ్రామాల్లో బుధవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ సునీల్‌కుమార్ ఎన్నికల ప్రచారం ప్రారంభించనున్నట్లు జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి మనోహర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 8.30 గంటలకు జంగాలపల్లె పంచాయతీలోని 70 కొత్తపల్లె వినాయకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారం ప్రారంభించనున్నట్లు తెలిపారు.

వలంటీర్లకు వందనం

ఐరాల: మండలంలో 19 సచివాలయాల పరిధిలో విధులు నిర్వహిస్తున్న వలంటీర్లకు వందనం కార్యక్రమం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కుసుమకుమారి మంగళవారం తెలిపారు.

యాదమరిలో..

యాదమరి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నేడు బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు వలంటీర్లకు అభినందన సభ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సింగయ్య తెలిపారు.

చిత్తూరు కౌన్సిల్ బడ్జెట్ సమావేశం

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కౌన్సిల్ బడ్జెట్ సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు, అలాగే మధ్యాహ్నం 2 గంటలఎ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్టు మేయర్ అముద ఓ ప్రకటనలో తెలిపారు. కార్పొరేటర్లు, ఎక్స్‌-అఫిషియో సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు హాజరుకావాలని ఆమె కోరారు.

‘స్వీప్’ చేస్తున్నారు..!

- ఓటర్లలో పెరుగుతున్న అవగాహన
- కొత్త ఓటర్ల నమోదు.. మార్పులపై మక్కువ
- సత్ఫలితాలిస్తున్న యంత్రాంగం కృషి



పతంగులను ఎగురవేస్తూ ఓటుపై కార్పొరేషన్ అధికారులు చేస్తున్న వినూత్న ప్రచారం

చిత్తూరు అర్బన్: ప్రజల పక్షాన నిలబడి, అందరికీ సంక్షేమ ఫలాలను అందించే నాయకులను ఎన్నుకోవడానికి ఉన్న ఏకైక ఆయుధం ఓటు. ఈ హక్కును వినియోగించుకోవడంలో కొందరు అనాసక్తిగా ఉంటే.. మరికొందరు తమకెందుకులే అని మిన్నకుండిపోతుంటారు. ఎన్నికల వేళ ఓటరు తన ఓటు హక్కు తప్పనిసరిగా వినియోగించుకునేలా చేయడంతో పాటు కొత్త ఓటర్ల నమోదు, జాబితాలో మార్పులు-చేర్పులు లాంటివాటిని సద్వినియోగం చేసుకోవడానికి భారతీయ ఎన్నికల సంఘం రూపొందించిన కార్యక్రమమే ‘స్వీప్’ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ ప్రోగ్రాం). ఇటీవల చిత్తూరులో స్వీప్‌పై కలెక్టర్ నుంచి మునిసిపల్ కమిషనర్ వరకు ప్రజల్లో ఆసక్తి పెంచుతూ పోలింగ్‌లో ఓటింగ్ నమోదు శాతాన్ని పెంచడానికి అవగాహన ర్యాలీ సైతం నిర్వహించారు.

ఎందుకంటే..

చిత్తూరు నియోజకవర్గ అసెంబ్లీ పరిధిలో దాదాపు 2.01 లక్షల మంది ఓటర్లు ఉంటే సగటున 75 శాతం పోలింగ్ నమోదవుతోంది. జాతీయస్థాయిలో నిర్ణయించిన సగటు పోలింగ్ శాతం (75శాతం)ను చిత్తూరు చేరుకున్నట్లే. అయితే ఈ గణాంకాలను మరింత పెంచడానికి అధికారులు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. విద్యావంతులు, యువత మాత్రం తమ ఓటు హక్కును వినియోగించుకోవడంలో కాస్త నిర్లక్ష్యంగా ఉన్నారని గుర్తించారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ఎన్నికల రోజున పోలింగ్ శాతం పెంచడానికి ‘స్వీప్’ పై ఈసీ దృష్టి సారించింది. ఇందులో భాగంగా చిత్తూరులో ఇప్పటికే అధికారులు ఓటర్లు తమ ఓటుహక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరుతూ విస్తృత ప్రచారం చేస్తున్నారు. 18 ఏళ్లు నిండిన యువత తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవడం, ఓటర్ల జాబితాలో ఉన్న వివరాలను పరిశీలించి తప్పుల్లేని వివరాల నమోదుపై దృష్టి పెట్టడం, మృతి చెందిన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించడం, సామాజిక మాధ్యమాల ద్వారా ఓటర్లలో చైతన్యం తేవడం..ఇత్యాది కార్యక్రమాలు ఇప్పటికే కొనసాగిస్తున్నారు.

యువత ఆసక్తి

చిత్తూరు అసెంబ్లీ స్థానంలో 2009లో 71 శాతం పోలింగ్ నమోదైతే.. 2014లో 75.52, 2019లో 79.34 శాతం పోలింగ్ నమోదైంది. దీనిని మరింత పెంచడానికి కలెక్టర్ ఆదేశాలతో రంగంలోకి దిగిన కార్పొరేషన్ అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. గాంధీ విగ్రహం కూడలిలో భారీ ఈవీఎం నమూనా ఏర్పాటు చేయడంతో పాటు అటువైపు వెళ్లే ప్రజలకు ఈవీఎంను ఉపయోగించే పద్ధతులు, వీవీ ప్యాట్ పనితీరుపై ప్రదర్శనలు ఇస్తున్నారు. ఇక నా ఓటు, నా హక్కు, నా తీర్పు అంటూ 18 ఏళ్లు నిండిన యువత తప్పనిసరిగా ఓటును వినియోగించుకుంటామని సంతకాలు తీసుకోవడం, మార్కెట్లు, ప్రధాన కూడళ్లలో ఓటు అవసరాన్ని తెలియచేయడం చేస్తున్నారు. పైగా గత ఎన్నికల్లో పోలింగ్ శాతం తక్కువగా ఉన్న క్లస్టర్లను గుర్తించి ఓటర్లు తప్పనిసరిగా బూత్‌కు వచ్చేలా అవగాహన కల్పిస్తున్నారు. చిత్తూరులో ఇటీవల 4,149 మంది కొత్తగా ఓటర్లు నమోదవడం వెనుక అధికారుల కృషి ఉంటోంది.

కలెక్టర్ ఆదేశాలతో..

స్వీప్‌పై జిల్లా ఎన్నికల అధికారిగా ఉన్న కలెక్టర్ సూచనలతో కొత్త పద్ధతులతో ప్రజల్లోకి వెళుతున్నాం. స్వీప్‌పై వినూత్నంగా ఏం చేయాలి..? ఎలా చేయాలి..? అనే అంశాలపై ఎప్పటికప్పుడు కలెక్టర్ నుంచి వచ్చే ఆదేశాలతో యువతను ఇందులో భాగస్వామ్యం చేస్తున్నాం. ఇది నిరంతర ప్రక్రియ. ప్రతీ ఓటరు ఓటు హక్కును తప్పనిసరిగా ఉపయోగించుకోవాలని చూస్తున్నాం.

– డాక్టర్ అరుణ, నోడల్ అధికారి, స్వీప్ కమిటీ

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం



అవార్డులు అందుకున్న వలంటీర్లతో డాక్టర్ సునీల్‌కుమార్, ప్రజాప్రతినిధులు, అధికారులు

- పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ సునీల్‌కుమార్

బంగారుపాళెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శమని మాజీ ఎమ్మెల్యే, పూతలపట్టు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీడీఓ శివశంకర్ అధ్యక్షతన ‘వలంటీర్లకు వదనం’ కార్యక్రమం నిర్వహించారు. మండలంలో సేవారత్న అవార్డుకు సరస్వతి(టేకుమంద), పల్లవి (తిమ్మోజుపల్లె), శ్రావణి(కూర్మాయిపల్లె), ఢిల్లీరాజా(కీరమంద), శోభారాణి(సంక్రాంతిపల్లె), 364 మంది వలంటీర్లు సేవామిత్ర అవార్డులకు ఎంపికయ్యారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సునీల్‌కుమార్, ప్రజాప్రతినిధులు శాలువలతో అవార్డు గ్రహీతలను సత్కరించి అవార్డులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ వలంటీర్ల వ్యవస్థ ఉన్నందునే అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేసి న్యాయం చేయగలిగామన్నారు. వలంటీర్లు ప్రజలకు చేస్తున్న సేవలను చూసి చంద్రబాబు, టీడీపీ నేతలు వలంటీర్ వ్యవస్థను విమర్శిస్తున్నారని మండిపడ్డారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో వలంటీర్ల పాత్ర కీలకమని అన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఈ వ్యవస్థను తొలగించే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ సోమశేఖర్, సర్పంచులు వాణి ప్రియ, ఉమాదేవి, ప్రసాద్‌రెడ్డి, భారతి, కృష్ణమూర్తి, సింగిల్ విండో అధ్యక్షుడు దత్తాత్రేయరెడ్డి, కురబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అమరనాథ్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



హాజరైన వలంటీర్లు

ప్రజాసేవకులు వైఎస్సార్, జగన్



విజయానందరెడ్డిని ఆశీర్వదిస్తున్న వైఎస్ విమలారెడ్డి, పాస్టర్లు

- వైఎస్ విమలారెడ్డి
- భారీ మెజార్టీతో వైఎస్సార్ సీపీ గెలవాలని పాస్టర్లతో ఆశీర్వాదం

చిత్తూరు కార్పొరేషన్: నిజమైన ప్రజాసేవకులు దివంగత సీఎం వైఎస్సార్, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్ విమలారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో జిల్లా సేవకుల (పాస్టర్లతో) సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విమలారెడ్డి మాట్లాడారు. వచ్చి ఆమె మాట్లాడారు. తండ్రిలాగే అన్ని కులాలు బాగుండాలనే జగన్ ఆలోచిస్తారన్నారు. కులమతాలకు అతీతంగా సంక్షేమ పాలన అందిస్తున్నారని, పేదల ఆకలి తీర్చి, వారి జీవితంలో వెలుగులు నింపుతున్నారన్నారు.సేవ చేసే వారికి భగవంతుడి కృప ఎప్పుడూ ఉంటుందని, అలాగే సేవ చేస్తున్న వారినే నేతలుగా ఎన్నుకుంటే అందరూ బాగుంటారన్నారు. ఇచ్చిన మాట కోసం ఎంతదూరమైనా ప్రయాణం చేస్తారన్నారు. విజయానందరెడ్డి తనవంతుగా పేదలకు సాయం చేస్తున్నారని, ఆ సేవలే ఆయన శ్రమకు గుర్తింపు, ఫలితం ఇస్తాయని ఆశీర్వదించారు. విజయానందరెడ్డి మాట్లాడుతూ, జగనన్న స్ఫూర్తితోనే తానూ పేదలకు సాయం చేస్తున్నానని, తనవంతుగా నియోజకవర్గ వాసులకు అన్నదానం చేస్తున్నానని, వ్యాపారుల కోసం మార్కెట్ గేటు ఎత్తివేయించామని, పాస్టర్లకు బట్టలు, ముస్లింలకు రంజాన్‌తోఫా, జగనన్న పేరు మీద 17 వాటర్‌ప్లాంట్లు ఏర్పాటు, జగనన్న జన్మదినం సందర్భంగా 55 వేల మహిళలకు బట్టలు పంపిణీ చేసినట్టు తన సేవా కార్యక్రమాల గురించి వివరించారు. చిత్తూరులో వైఎస్సార్‌సీపీ ఆదరణ బాగుందన్నారు. అన్ని వర్గాలతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, క్రిస్టియన్‌ల అభ్యున్నతికి కూడా జగనన్న పాటు పడుతున్నారని ప్రజలు గుర్తెరగాలని విజ్ఞప్తి చేశారు. తొలుత విమలారెడ్డి, పాస్లర్లు విజయానందరెడ్డిని, చిత్తూరులో భారీ మెజార్టీతో వైఎస్సార్ సీపీ గెలవాలని ప్రార్థనలు చేసి ఆశీర్వదించారు.

‘గజ’ బాధితులకు రూ.25.92 లక్షలు మంజూరు

చిత్తూరు కార్పొరేషన్: ఏనుగుల దాడిలో నష్టపోయిన వారికి చిత్తూరు వెస్ట్, ఈస్ట్ రేంజ్ పరిధిలో రూ.25.92 లక్షలను ప్రభుత్వం విడుదల చేసిందని ఎఫ్‌ఆర్వోలు బాలకృష్ణారెడ్డి, థామస్ మంగళవారం తెలిపారు. ఈరెండు రేంజ్‌ల పరిధిలో 155.94 ఎకరాల పంట నష్టానికి రూ.8.28 లక్షలు, మూడు జంతువులు మరణించగా రూ.1.38లక్షలు, ముగ్గురు చనిపోగా రూ.15 లక్షలు, గాయపడిన ఒకరికి రూ.1.26 లక్షల చొప్పున మంజూరు చేశారని వివరించారు. వీటిని త్వరలో బాధిత కుటుంబాలకు ఇవ్వనున్నట్లు చెప్పారు.

వలంటీర్లకు వందనం రేపు

పూతలపట్టు: స్థానిక బాలాజీ కల్యాణ మండపంలో గురువారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రసన్నకుమారి ఓ ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ సునీల్ కుమార్ పాల్గొంటారని పేర్కొన్నారు. మండలంలోని వలంటీర్లు, అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని ఆమె తెలిపారు.

దుస్తుల వితరణ



దుస్తులు పంపిణీ చేస్తున్న దాతలు

బంగారుపాళెం: స్థానిక సామాజిక ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో మంగళవారం దాతల సహకారంతో కుష్టు వ్యాధిగ్రస్తులకు ఉచితంగా దుస్తులు పంపిణీ చేసినట్లు డిప్యూటీ పారామెడికల్ అధికారి మణి తెలిపారు. దాతలు రవి, తిలగవతి ఆర్థిక సాయంతో 50 మందికి ఉచితంగా దుస్తులు అందజేసినట్లు తెలిపారు. న్యూక్లియర్ మెడికల్ అధికారి డాక్టర్ సాయిషర్మిళ, సిబ్బంది జాన్‌పీటర్, బాబు, జయచంద్ర, ప్రకాష్, శివకుమార్ పాల్గొన్నారు.

ఇత్తడి వస్తువుల సమర్పణ



చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మకు పుంగనూరు మండలం భీమగానిపల్లెకు చెందిన లోకేష్, పలమనేరుకు చెందిన పవన్ మిత్ర బృందం కలిసి ఇత్తడి వస్తువులను సమర్పించారు. మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. రూ.60వేలతో అమ్మవారి గర్భాలయం గడప, అమ్మవారి పాదాలను ఇత్తడితో చేయించినట్లు చెప్పారు. పూజల అనంతరం ఆలయ అధికారులు దాతలను సన్మానించి జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అందజేశారు.

ఇంటి వద్దకే వైద్యం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ సంధ్య



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

గుడిపాల: రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌తో ప్రజల ఇంటి వద్దకే వైద్యం వస్తోందని గుడిపాల వైద్యాధికారి సంధ్య అన్నారు. మంగళవారం మండలంలోని చిత్తపారలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు, బీపీ, మధుమేహం వ్యాధిగ్రస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఆరోగ్యశ్రీ పథకం కింద శస్త్ర చికిత్స చేయించుకున్న వారికి ఇంటి వద్దకే వెళ్లి పరీక్షించారు. వైద్య సిబ్బంది చంద్ర, హేమలత, మంజుల పాల్గొన్నారు.

ఇంటింటికీ వైద్యసేవలు

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్‌తో ప్రభుత్వం ప్రజల ముంగిట్లోకి వైద్యసేవలు అందుబాటులోకి తీసుకొచ్చిందని పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. నాంపల్లెలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ నిర్వహించారు. 104 వాహనంలో 80 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల

- నియోజకవర్గంలో 43 పంచాయతీలకు రూ.82లక్షలు మంజూరు
- తాగునీరు సరఫరా, పారిశుధ్యం, అభివృద్ధి పనులకు ప్రాధాన్యం



వసంతాపురం గ్రామ సచివాలయం

గుడిపాల: గ్రామ పంచాయతీల్లో వివిధ అభివృద్ధి పనులు చేసేందుకు 15వ ఆర్థిక కసంఘం నిధులు విడుదలయ్యాయి. చిత్తూరు నియోజకవర్గంలో 43 గ్రామ పంచాయతీలకు కలిపి రూ.82లక్షలు మంజూరయ్యాయి .ఈ మొత్తం ఇప్పటికే పంచాయతీల ఖాతాల్లో జమయ్యాయి. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు,హెల్త్ క్లినిక్స్, నాడు-నేడు కింద పాఠశాలల అభివృద్ధి, అవసరమైన చోట సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇప్పుడు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కావడంతో గ్రామాల్లో అభివృద్ధి మరింత పరుగులు తీయనుంది. ఈ నిధుల్లో కొంత గ్రామ పంచాయతీల విద్యుత్ బిల్లులకు చెల్లించాల్సి ఉంది. మిగిలిన వాటితో సర్పంచులు పంచాయతీ తీర్మానం మేరకు గ్రామాల్లో తాగునీటి సరఫరా, వీధిలైట్ల నిర్వహణ, పారిశుధ్యం మెరుగు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు తదితర అవసరాలకు ఈ నిధులు వినియోగించుకోవచ్చు.

చిత్తూరు మండలంలో విడుదులైన నిధులు ఇలా...

- చిత్తూరు మండలంలో 17 గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 34,26,683 మంజూరయ్యాయి. ఆనగల్లు పంచాయతీకి రూ.1,11,791, అనంతాపురం రూ.1,69,078, బీఎన్‌ఆర్‌పేట రూ.1,29,280, చెర్లోపల్లె రూ.4,33,802, చింతలగుంట రూ.1,16,822, దిగువమాసాపల్లె రూ.4,56,828, గువ్వకల్లు రూ.1,22,234, కుర్చివేడు రూ.1,49,918, ముత్తుకూరు రూ.1,79,247, నాయనిచెరువు రూ.1,18,382, పచ్చనపల్లె రూ.1,72,089, పాలూరు రూ.1,13,313, పెద్దశెట్టిపల్లె రూ.1,05,125, పెరుమాళ్లఖండిగ రూ.1,37,046, తాళంబేడు రూ.3,42,399, తొప్పాతిపల్లె రూ.1,61,834, తుమ్మింద రూ.4,07,045 నిధులు మంజూరైంది.

గుడిపాల మండలంలో..

- 189కొత్తపల్లె రూ.3,12,061, 197రామాపురం రూ.3,04,200,
- ఏఎల్‌పురం రూ.1,19,269, బసవాపల్లె రూ.2,36,967, బొమ్మసముద్రం రూ.1,78,295, బండపల్లె రూ.1,18,730, చిత్తపార రూ.2,78,165,
- గట్రాళ్లమిట్ట రూ.1,20,352, గొల్లమడుగు రూ.1,34,765, గుడిపాల రూ. 1,98,458, కమ్మతిమ్మాపల్లె రూ.1,07,152, క్రిష్ణజమ్మాపురం రూ.78,828,
- కుప్పిగానిపల్లె రూ.1,32,070, మంది క్రిష్ణాపురం రూ.1,41,556, మరకాలకుప్పం రూ.3,38,462, మొగరాళ్లపల్లె రూ.1,51,245, నంగమంగళం రూ.1,45,886,
- నారగల్లు రూ.2,67,832, పానాటూరు రూ.2,77,093, పాపసముద్రం రూ.1,91,082, పేయనపల్లె రూ.1,41,729, రామభద్రాపురం రూ.1,54,513,
- శ్రీరంగంపల్లె రూ.98,738, వసంతాపురం రూ.2,18,024, వెంగమాంబపురం రూ.1,20,418, వెప్పాలమానుచేను రూ.1,26,229 చొప్పున మొత్తం రూ.46,92,119 విడుదల చేశారని గ్రామ పంచాయతీల విస్తరణాధికారి క్రిష్ణప్రసాద్ తెలిపారు.

సంపూర్ణ ఆరోగ్యానికే ఆరోగ్య సురక్ష





పుల్లూరులో కళ్లద్దాలను అందజేస్తున్న నేతలు, బంగారుపాళెంలో వైద్య పరీక్షలు

ఐరాల: మండలంలోని పుల్లూరు సచివాలయ పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష-2 శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 152 మందికి వైద్యులు వైద్య పరీక్షలు చేశారు. వృద్ధులకు కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి కళ్లద్దాలు, హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. స్పెషలిస్టు డాక్టర్లు స్వాతిసింధూర, రాజేశ్వరి, శిరీష, శారద, హరిప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ మునిరత్నం, వైస్ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, ఎంపీడీఓ కుసుమకుమారి, ఎంపీహెచ్‌ఈఓ శివయ్య పాల్గొన్నారు.

బంగారుపాళెంలో..

బంగారుపాళెం: తంబుగానిపల్లె జెడ్పీ హైస్కూల్ ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 281 మందికి డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఎంపీడీఓ శివశంకర్, , మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్ చెంగల్‌రాయన్, డాక్టర్లు శిరీష, షాలిని, సంధ్యారాణి, ఎంపీహెచ్‌ఈఓ రమేష్‌బాబు పాల్గొన్నారు. సర్పంచ్ భారతి, నేత అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

యాదమరిలో..

యాదమరి: మండలంలోని వరదరాజుల పల్లె సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచ్ పుష్పలత, వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్, సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: నలిశెట్టిపల్లెలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్యాధికారులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ మోహన్‌వేలు, ఆర్థో స్పెషలిస్టు డాక్టర్ పవన్, గైనకాలజిస్టు డాక్టర్ రోషిణి, కంటి వైద్యులు డాక్టర్ ఉమామహేశ్వరి 168 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మెరుగైన వైద్యం కోసం కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యానికి రెఫరల్ చేశారు. సీహెచ్‌ఓ రాజామణి పాల్గొన్నారు.



వరదరాజులపల్లె మాట్లాడుతున్న వైద్యాధికారి



నలిశెట్టిపల్లెలో రోగులకు వైద్యం చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

బ్రహ్మోత్సవ బుక్‌లెట్ల ఆవిష్కరణ

తిరుపతి(అలిపిరి): శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఫిబ్రవరి 29 నుంచి మార్చి 8వ తేదీ వరకు నిర్వహించనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించి బుక్‌లెట్లను టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి తిరుపతిలోని శ్రీ పద్మావతి విశ్రాంతి గృహంలో మంగళవారం సాయంత్రం ఆవిష్కరించారు. ఫిబ్రవరి 28న సాయంత్రం అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, రాత్రి 7 నుంచి 8 గంటల వరకు వాహనసేవలు నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధానంగా ఫిబ్రవరి 29న ధ్వజారోహణం(మీనలగ్నం), మార్చి 4న గరుడ వాహనం, మార్చి 5న స్వర్ణరథం, మార్చి 7న రథోత్సవం, మార్చి 8న చక్రస్నానం నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం, ఎఫ్‌ఏసీఏఓ బాలాజి, సీఏఓ శేష శైలేంద్ర, చీఫ్ పీఆర్వో టి.రవి, ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈఓ వరలక్ష్మి, రవాణా జీఎం శేషారెడ్డి, డెప్యూటీ ఈఓ శివప్రసాద్ పాల్గొన్నారు.